క్లుప్తంగా

ఆలయానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం గుంటూరు జిల్లా, పెదకూరపాడు మండలం, అబ్బరాజు పాలెం గ్రామానికి చెందిన కల్లి లక్ష్మణ్ సందీప్‌రెడ్డి రూ.15,116 విరాళంగా అందజేశారు. ఈమేరకు నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ బి నాగరాజు చేతుల మీదుగా అందజేశారు. గోవుల సంరక్షణకు రూ.10,001 విరాళంగా ఇచ్చారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

సైడ్ కాల్వలపై ఆక్రమణల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

మక్కపేట(వత్సవాయి): మక్కపేటలో సైడ్‌కాల్వలపై ఆక్రమణలు పెరిగిపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంపై ఈనెల 14న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'రోడ్లపై పారుతున్న మురుగు'అనే కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని ప్రధానసెంటర్‌లో సైడ్‌కాల్వలపై ఆక్రమణలను పంచాయతీ అధికారులు తొలగించడంతోపాటు పూడికతీత పనులు చేపట్టారు. దీంతో మురుగునీటి పారుదల సజావుగా సాగుతోందని గ్రామస్తులు తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి' దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



బలుసుపాడు(జగ్గయ్యపేట): బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో చిట్టిబాబు సూచించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మా బడికి రండి కార్యక్రమం చేపట్టామని రానున్న విద్యా సంవత్సరానికి విద్యార్థులను ముందుగానే పాఠశాలల్లో చేర్పించుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. పాఠశాలల్లో వసతులు, రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.
అంగన్‌వాడీ కేంద్రంలోని 20మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోకి 16మంది విద్యార్థులను ప్రమోట్ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు రమణ, వెంకటేశ్వర్లు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయభాను బెదిరిస్తున్నారంటూ ఫిర్యాదు

జగ్గయ్యపేటఅర్బన్: ఆక్రమణల తొలగింపు పేరుతో మాజీ విప్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తమను బెదిరిస్తున్నారంటూ దుర్గాపురంవాసులు శనివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులోని ఉదయభానుకు చెందిన భూమికి సంబంధించి ఎఫ్ లైన్‌కు దరఖాస్తు చేసుకోగా 24మంది సుమారు 20సెంట్లు ఆక్రమించినట్లు తేలింది. వారిని ఖాళీ చేయాలని ఉదయభాను కోరగా నెలరోజులు సమయం కావాలని కోరారు. గడువు ముగియడంతో శనివారం పొక్లెయిన్ ద్వారా ఆస్థలంలో ఆక్రమణల తొలగింపు చేపట్టగా వారు అభ్యంతరం తెలిపారు. గతంలో ఉదయభాను ఆస్థలాలకు బీ ఫాం పట్టాలు ఇప్పించారని, ఇప్పుడు ఆయనే ఆ స్థలాలు తనవి అని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఆయా గృహాల వారు స్థానిక కౌన్సిలర్ వేదులాపురి అలేఖ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సైదాను ఆశ్రయించగా వారు అక్కడికివెళ్లి ఆక్రమణలను తొలగించవద్దని కోరారు. పోలీసులు, ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, మున్సిపల్‌చైర్మన్ రాఘవేంద్ర అక్కడికి చేరుకొని మరోసారి కొలతలు వేసి నిర్ధారణకు రావాలని, అప్పటివరకు తొలగింపు చేపట్టవద్దని సూచించడంతో ఆ పనులు నిలిచిపోయాయి. అనంతరం నివాస గృహాల వారు స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్‌ను కలిసి ఉదయభాను తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే రాజగోపాల్ స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో ఆరోగ్యానికి ముప్పు



నందిగామలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య



జగ్గయ్యపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది

నందిగామటౌన్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలుతో పర్యావరణంతోపాటు మానవ ఆరోగ్యానికి సైతం ముప్పు వాటిల్లుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రమణబాబు అధ్వర్యంలో శనివారం ఈ వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) సేకరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. గాంధీ సెంటరులో ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ కియోస్క్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను ఈవేస్ట్‌ను కియోస్క్‌లో అందించాలని కోరారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో కలిగే అనర్థాలపై అందరూ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏవీఆర్‌పీఎం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఆయాశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: ప్లాస్టిక్ వినియోగించకుండా పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ ఏర్పాటుచేయగా, ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలను అందరూ తెలుసుకోవాలని కోరారు. అలాగే పట్టణంలోని అన్ని సచివాలయాల్లో కూడా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈ-వేస్ట్)పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, తహసీల్దార్ మనోహర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కంచికచర్లలో ప్రత్యేక కౌంటర్లు

కంచికచర్ల: ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తలెత్తే దుష్పరిణామాలను అధిగమించేందుకు వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు తెలిపారు. సర్ణాంధ్ర-సచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ సచివాలయం-1లో శనివారం గ్రామసభ నిర్వహించారు. అధికారులంతా ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. స్వచ్ఛాంధ్రకు పాటుపడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వేస్టేజ్ సేకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కంచికచర్ల వాసులు తమఇళ్లలో నిరుపయోగంగా ఉన్న సెల్‌ఫోన్లు, బ్యాటరీలు, చార్జర్లు, కంప్యూటర్ కీబోర్డులు తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఈ కౌంటర్లలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్. సుబ్రహ్మణ్యం, పంచాయతీ సీనియర్‌అసిస్టెంట్ వెల్లంకి రామారావు, వెలుగు సీసీలు, ఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనేక ఇబ్బందులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సర్పంచ్ గోనెల దేవి, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి కె.వాణి సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయుర్వేద ఆసుపత్రి వద్ద వైద్యశాల, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతకు పాటుపడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు.



కొణకంచి ఆయుర్వేద ఆసుపత్రి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి వాణి, గ్రామస్తులు



కంచికచర్లలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, పంచాయతీ సిబ్బంది

వైభవంగా కల్యాణోత్సవం



నందిగామరూరల్: మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో వేంచేసియున్న అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారికి చక్రస్నానం, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. శుక్రవారం రాత్రి ఆలయ ధర్మకర్త ఇంటూరి సీతయ్య పర్యవేక్షణలో అర్చకులు సుదర్శనాచార్యులు, వెంకటరాజన్ ఆచార్యులు వైఖానస సంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చున్ని స్వామివారి కల్యాణం జరిపించారు. ముందుగా స్వామి వారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం కూలీలకు శనివారం పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ ముత్తవరపు పావని వెంకటేష్ మజ్జిగ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వారి సౌకర్యార్థం తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సంక్రాంత్, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పక్షోత్సవాలు



పెనుగంచిప్రోలులో చిన్నారుల తల్లులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 8నుంచి 22 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి, అధిగమించడం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ఈ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల పర్యవేక్షణ, ఎదుగుదల లోపం ఉన్నవారికి పౌష్టికాహారం అందించి మామూలు స్థితికి తీసుకురావడం, గర్భిణుల బరువులు పరిశీలించి అవసరమైన వైద్య పరీక్షలు చేయించడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమని ఐసీడీఎస్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు.

14,098 మంది లబ్ధిదారులు..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 267 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో గర్భిణులు 980 మంది, బాలింతలు 1122మంది, మూడేళ్లలోపు చిన్నారులు 5868మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 6128 మంది ఉన్నారు.వీరంతా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు.

1000 రోజుల ప్రణాళిక అమలు..

అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ 1000 రోజుల ప్రణాళికపై దృష్టి పెట్టి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గర్భిణుల ఆరోగ్యం, రెండేళ్లకంటే తక్కువ వయస్సుగల చిన్నారుల్లో ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారుల గృహాలకు వెళ్లి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కౌమార దశలో ఉన్న బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహార లోపం ఉన్నవారిని గుర్తించి అదనపు పోషకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయడంతోపాటు గర్భిణులకు అంగన్‌వాడీల్లో సామూహిక సీమంతాలు చేస్తున్నారు.చిరుధాన్యాలతో ఆహారం తయారీపై అవగాహన కల్పిస్తూ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీలు పనిచేస్తున్నారు.

వినూత్న కార్యక్రమాలు..



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 22వతేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా 1000 రోజుల ప్రణాళికపై దృష్టి పెట్టేలా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు, చిన్నారులను భాగస్వాములను చేస్తూ ప్రతిరోజూ ఓ వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– పి.లక్ష్మీభార్గవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, చిల్లకల్లు ప్రాజెక్టు

హైవేపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు వినతి



హైవే అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట పోలీసు సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారిపై గరికపాడు చెక్‌పోస్టు నుంచి మునగచర్ల వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐ వెంకటేశ్వర్లు శనివారం హైవే అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో జాతీయ రహదారి 28 కిలోమీటర్ల మేర ఉందన్నారు. గరికపాడు, గరికపాడు చెక్‌పోస్టు, వెంకటసాయి ఫుడ్ ప్లాజా, షేర్‌మహ్మద్‌పేట, బలుసుపాడు క్రాస్‌రోడ్డు, తోటచర్ల, కొణకంచి, నవాబుపేట, గట్టు భీమవరం ప్రాంతాల్లో వై జంక్షన్‌ల వద్ద ప్రమాదాల నియంత్రణకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా పాయింట్‌ల వద్ద తగినంత లైటింగ్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రెండునెలల్లో చర్యలు తీసుకుంటామని హైవే అధికారులు చెప్పినట్లు సీఐ వివరించారు. టోల్‌ప్లాజా ఇన్‌చార్జి నాగకృష్ణ, ఎలక్ట్రికల్ ఇంజినీర్ రమేష్, ఇంజినీర్ మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాశన



చిన్నారుల అన్నప్రాశన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నందిగామటౌన్: చిరుధాన్యాలు, ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. పోషణా పక్షోత్సవాలలో భాగంగా శనివారం నందిగామ పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమీషనర్ రమణబాబు, గోళ్లమూడి వైద్యాధికారి విజయ్‌కృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ ..

నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేట, లింగాలపాడు గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ముందుగా చిన్నారుల ఎత్తు, బరువుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాబి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టించవచ్చు : పీడీ



వ్యర్థాల సేకరణను ప్రారంభిస్తున్న పీడీ రాము

గంద్రాయి(జగ్గయ్యపేట): పంచాయతీల్లో చెత్త నుంచి సంపద సృష్టించాలని డ్వామా పీడీ రాము సూచించారు. గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన గంద్రాయిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిపొడి చెత్తపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా తడి,పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ కార్యదర్శులకు సహకరించాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల కారణంగా భవిష్యత్‌పై తీవ్ర దుష్ప్రభావం పడుతుందన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రికల్ వ్యర్థాలను వేసేందుకు డస్ట్‌బిన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, సర్పంచ్ లూర్దుమేరి, కార్యదర్శులు సాయిసంధ్య, రమాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమావేశం

వీరులపాడు: వేసవికాలం దృష్ట్యా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అరుంధతీదేవి ఆదేశించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో శనివారం ఆమె ఆయా గ్రామాల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కంచికచర్ల: ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నప్పుడు రోగులు, సిబ్బందిని రక్షించే విధానంపై కంచికచర్ల ఫైర్ సిబ్బంది శనివారం ఆయా ఆస్పత్రుల నిర్వాహకులు, అధికారులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం , ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిమాపకశాఖ అధికారి తలశిల శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, లేదా పోలీసులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. అప్రమత్తంగా ఉండటం ద్వారా అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడవచ్చిని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో ప్రమాదాలు జరిగినపుడు అక్కడ ఉన్న రోగులు, , ఆరోగ్య సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చే విధానంపై ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు కె.మధురిమ, ఫైర్ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, కె.ప్రవీణ్‌కుమార్, కె.జయరాం, జి.శేఖర్‌బాబు, ఎం.అశోక్, షేక్ తాజుద్దీన్, సంజయ్‌వర్మ, జి.రాజశేఖర్, జీవీ నర్సయ్య, షేక్ సుభాని, ఎస్.శ్రీనివాస్, జి.జీవన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన మనీషాను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

పెనుగంచిప్రోలు: కాజ్‌వేపై నుంచి మునేరులో పడటంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని పెనుగంచిప్రోలులో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట ప్రాంతానికి చెందిన ఆర్.నాగేంద్రబాబు తనభార్య మనీషాతో కలసి మధిర నుంచి బైక్‌పై వస్తుండగా మునేరు వద్ద వాహనం అదుపుతప్పింది. దీంతో బైక్‌పై ఉన్న మనీషా కాజ్‌వే పైనుంచి మునేరులో పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక పోలీసులు, 108 సిబ్బంది కలసి నిచ్చెన సాయంతో బయటకు తీశారు. అనంతరం 108 సిబ్బంది ఆమెను జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

468 మందికి వైద్యపరీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాలలోని 468మంది బాలికలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు, టూత్ పేస్టులు పంపిణీ చేశారు. దృష్టిలోపం ఉన్న వారికి కళ్లజోళ్లు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్దన్, ప్రతినిధి చాముండేశ్వరి, కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు, డాక్టర్ సుదీప్తి, నాయకులు వెలమాటి చంద్రమౌళి, ముల్లంఢి రామకృష్ణారెడ్డి, గద్దె రాజ్యలక్ష్మి, కానూరు కిషోర్, యానాల గోపి, గింజుపల్లి రమేష్, అమ్మనబోయిన రాణి, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుజాత పాల్గొన్నారు.

సిలిండర్ నుంచి మంటలు



మునేరులో పడేసిన గ్యాస్ సిలిండర్

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద శనివారం భక్తులు తమ వెంట తెచ్చుకున్న చిన్న సిలిండర్‌పై వంట చేసుకుంటుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వచ్చాయి. దీంతో స్థానిక దుకాణాల యజమానులు, ఆలయ హోంగార్డులు స్పందించి సిలిండర్‌ను కర్రకు కట్టి దూరంగా ఉన్న మునేరు నీటిలో పడేసారు. గతంలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో దుకాణాలన్నీ బూడిదైన ఘటనను గుర్తుచేసుకుని దుకాణాదారులు ఆందోళన చెందారు. ప్రమాదం తప్పిందని తెలుసుకుని దుకాణదారులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

విద్యార్థులకు కళ్ల జోళ్ల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు కళ్ల జోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులకు మాక్సివిజన్ హాస్పిటల్ సహకారంతో గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 74 మందిలో దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ నగర అధ్యక్షురాలు డాక్టర్ వి.శ్రీదేవి విద్యార్థులకు కళ్ల జోళ్లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య, ఉపాధ్యాయులు డీవీ మురళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.